క్లుప్తంగా

గంగులను కలిసిన సీఐ



మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డితో సీఐ రమేష్‌బాబు

ఆళ్లగడ్డ : మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్ రెడ్డిని పట్టణ సీఐ రమేష్‌బాబు కలిశారు. ఇటీవల పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రమేష్‌బాబు బుధవారం మర్యాద పూర్వకంగా ఆయనను కలిశారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలో శాంతి భద్రతలపై చర్చించారు.

ఉద్యోగ విరమణ తప్పనిసరి

చాగలమర్రి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని ఐసీడీఎస్ సుపర్‌వైజర్ సువీల అన్నారు. బుధవారం మండలంలోని చిన్న బోధనం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త ఓబులమ్మ ఉద్యోగ విరమణ సందర్భంగా చాగలమర్రిలోని 10 అంగన్‌వాడీ కేంద్రంలో ఆమెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని రక్షించుకుందాం



అవగాహన కల్పిస్తున్న అటవీ అధికారులు

ఆళ్లగడ్డ: పర్యావరణ పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని అటవీ అధికారి శ్రీనివాసులరెడ్డి పిలుపునిచ్చారు. పర్యావరణ హిత జీవన శైలి కార్యక్రమంలో భాగంగా బుధవారం నూతల సెక్షన్ పరిధిలోని పి.నాగిరెడ్డిపల్లె గ్రామంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ భావితరాలకు మెరుగైన ఆరోగ్యాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్క నాటి పెంచాలన్నారు. ప్లాస్టిక్ వస్తువులు నిషేధించాలన్నారు. అంతకు ముందు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అటవీ అధికారి నాగేంద్రయ్య ఉన్నారు.

5న మాన్యం కౌలుకు వేలం

శిరివెళ్ల: ఈనెల 5వ తేదీన గుండంపాడులోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ మాన్యం కౌలుకు బహిరంగ వేలం పాటలను నిర్వహిస్తున్నట్లు ఈఓ వేణునాథరెడ్డి, చైర్మన్ శివరామిరెడ్డి బుధవారం తెలిపారు. వేలంలో పాల్గొనే వారు రూ.2 వేలు డిపాజిట్ చెల్లించాలన్నారు. హెచ్చు పాట పాడిన వారికే కౌలు రశీదు ఇస్తామని, ఆలయానికి బకాయిలున్న వారు పాటలకు అనర్హులని వివరించారు.

ఉపాధి కూలీకి పాము కాటు



చికిత్స పొందుతున్న ఓం శివనాయక్

చాగలమర్రి: మండలంలోని శెట్టివీడు మజరా గ్రామమైన కదిరిపురం తండాకు చెందిన ఉపాధి హామీ కూలీ ఓం శివనాయక్ తండా సమీపంలో ఉపాధి హామీ పనులు చేస్తుండగా పాము కాటు వేసింది. మట్టి తవ్వుతుండగా ఏదో గుచ్చుకున్నట్లు అనిపించడంతో చూడగా పాము కాటు వేసినట్లు గుర్తించి కేకలు వేశాడు. దీంతో తోటి కూలీలు బాధితుడిని చాగలమర్రిలోని కేరళ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం కోలుకున్నాడని కూలీలు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ



విధుల్లో చేరిన సురేష్

శిరివెళ్ల: మండల నూతన ఎస్ఐగా సురేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పని చేస్తున్న ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డిని రుద్రవరం స్టేషన్‌కు అటాచ్‌మెంట్ చేశారు. దీంతో ఈ నియామకం జరిగింది. నూతన ఎస్ఐ డోన్ రూరల్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చారు.

బీజేపీ పాలనలో దేశం సుభిక్షం



మాట్లాడుతున్న నీలకంఠం

నంద్యాల(వ్యవసాయం): బీజేపీ తొమ్మిదేళ్ల పాలనలో దేశం సుభిక్షంగా ఉందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కునిగిరి నీలకంఠం పేర్కొన్నారు. బుధవారం స్థానిక రామకృష్ణ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ 9ఏళ్ల పాలన పూర్తయిన సందర్భంగా వికాస్ యాత్రలో భాగంగా నంద్యాలలో పర్యటిస్తున్నట్లు ఆయన తెలిపారు. మహిళలపై నేరాలు తగ్గుముఖం పట్టాయని, సామాజిక నేరాలు కూడా గణనీయంగా తగ్గాయన్నారు. వన్‌నేషన్ వన్ రేషన్ కార్డు పథకం వల్ల ప్రతి నెల 3.5 కోట్ల కుటుంబాలు లబ్ధి పొందుతున్నాయన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బుడ్డా శ్రీకాంతరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్య ఆచారి, ఇంటి ఆదినారాయణ, తూము శివారెడ్డి, లింగమయ్య పాల్గొన్నారు.

పశుబీమా.. రైతుకు ధీమా

- పాడి రైతుకు అండగా 'వైఎస్సార్ పశుబీమా'
- పాడి పశువులతో పాటు మగ పశువులకూ బీమా
- వేగవంతమైన క్లైముల పరిష్కారానికి చర్యలు
- బీమా పంపిణీలో ఏర్పడిన గందరగోళానికి తెర
- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం
- లబ్ధిదారుని వాటాలో సింహభాగం భరించనున్న సర్కారు



మేతకు వెళ్తున్న పాడిగేదెలు

నంద్యాల (సెంట్రల్)/ దొర్నిపాడు: వ్యవసాయ అనుబంధ రంగాల్లో పాడి పరిశ్రమ ప్రాధాన్యం వెలకట్టలేనిది. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా, అనారోగ్యం, ప్రకృతి వైపరీత్యాలు, ప్రమాదాలు పశు సంపదను కబళించి ఆర్థికంగా దెబ్బతీస్తాయి. ఈ ప్రతికూలతల నుంచి గట్టెక్కేందుకు ఉద్దేశించిందే పశుబీమా. గత సర్కారు హయాంలోనే ఈ పథకం రూపొందినా, చిత్తశుద్ధి లేమి, అశాస్త్రీయ విధానాలతో లబ్ధిదారులకు ఆశించిన ప్రయోజనం దక్కలేదు. ఈ క్రమంలో త్వరలో ప్రవేశపెట్టబోతున్న నూతన పశుబీమా పశుపోషకుల్లో ఆశలు చిగురించేలా చేస్తోంది.

నేరుగా రైతు చేతికి పాలసీ పత్రం..

2018 పశు గణన ప్రకారం జిల్లాలోని రెండు డివిజన్ల (నంద్యాల, ఆళ్లగడ్డ) పరిధిలో 16,02,698 సంఖ్యలో పశుసంపద ఉంది. ఇందులో ఆవులు 12,0565, గేదెలు 29,3,830, గొర్రెలు 88,2,449, మేకలు 30,5,854 ఉన్నాయి. ప్రస్తుతం ఆ సంఖ్య భారీగా పెరిగి ఉండవచ్చని అంచనా. గతంలో బీమా విధానం లోపభూయిష్టంగా ఉండేది. అదేదో అధికారుల తంతు అన్న విధంగా దరఖాస్తుకు ఎక్కువ శాతం ఆసక్తి చూపేవారు కాదు. అయితే కొత్త పథకంలో భాగంగా పాలసీ చేసిన వెంటనే నేరుగా పోషకులకే పాలసీ పత్రం అందజేస్తారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీతో ఒప్పందం చేసుకుంది. పశువు మరణించిన వెంటనే వైద్యుని శవపరీక్ష, బీమా సర్వేయర్ నివేదిక ఆధారంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వేగంగా పరిహారం అందుతుంది. దీనిపై పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కర్షకులకు దక్కనున్న ప్రయోజనం..

గత బీమా విధానంలో కేవలం ఉత్పాదక పశు పోషకులకే దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. సన్నకారు రైతులు, పట్టణాల్లో ఒంటెద్దు బండ్లతో పొట్ట పోసుకునే కర్షకులకు ఎద్దులే జీవనాధారం. మొదటిసారి మగ పశువులనూ (ఎద్దులు, దున్నపోతులు) జాబితాలో చేర్చారు. జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక దశలో 10,950 పశువులకు బీమా చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.

అర్హతలు..

పశుబీమా పథకంలో భాగంగా ఎస్సీ/ఎస్టీ/దారిద్యరేఖకు దిగువన ఉన్న వారు ప్రీమియం మొత్తంలో 20 శాతం, మిగతా వర్గాలు 50 శాతం చెల్లించాలని నిర్ణయించారు. మిగతాది ప్రభుత్వమే భరించి ప్రయోజనం చేకూర్చనుంది. పథకంలో ఒక కుటుంబానికి గరిష్టంగా 5 గేదెలకు, 50 గొర్రెలు/ మేకలు/ పందులకు పశుబీమా చేసుకోచ్చు. ఒక వేళ రైతులు పశువును ఇతరులకు విక్రయిస్తే వారంలోగా తెలియజేస్తే కొత్త పాలసీని నూతన రైతుకు వర్తింపజేసేలా చర్యలు చేపడతారు. బీమా పరిహారినికి పశువులు ట్యాగు తప్పనిసరి. పశువు మృతి చెందిన వెంటనే వైద్య సిబ్బంది, పశుసంవర్ధక శాఖ అధికారులకు సమాచారమివ్వాలి. దీంతో వారు పరిశీలించి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపుతారు. ఆ తరువాత పశు యజమానికి సాధ్యమైనంత త్వరగా తాను ఎంచుకున్న బీమా మొత్తం అందుతుంది. అయితే కేవలం పాడి రైతులకే కాకుండా రైతులకు వర్తింపజేయడంపై అన్నదాతల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

బీమా మొత్తం	లబ్ధిదారుని వాటా బీపీఎల్/ఎస్సీ/ఎస్టీ,	ఏపీఎల్	వ్యవధి (సంవత్సాలు)
రూ.30వేలు	రూ.384	రూ.960	3
రూ.15వేలు	రూ.192	రూ.480	3
గొర్రె లేదా మేకలకు			
రూ.6వేలు	రూ.36	రూ.90	1
రూ.6వేలు	రూ.54	రూ.135	2
రూ.6వేలు	రూ.75	రూ.187.5	3

ఆళ్లగడ్డ డివిజన్ వారీగా పశువులు రైతులు వివరాలు

మండలం	పాడి పశువులు సంఖ్య (అన్ని రకాలు)	పాడి రైతులు సంఖ్య
ఆళ్లగడ్డ	16.281	5.249
చాగలమర్రి	9.423	3.156
దొర్నిపాడు	5.875	1.965
కోవెలకుంట్ల	8.439	2.457
కొలిమిగుండ్ల	10.477	3.147
రుద్రవరం	17.456	5.248
సంజామల	12.410	3.892
శిరివెళ్ల	11.095	3.154
ఉయ్యాలవాడ	7.924	2.258
గోస్పాడు	7.354	2.145
మొత్తం	1.06.734	32.671

పెంపకందారులకు అధిక ప్రయోజనం



త్వరలో ప్రారంభం కానున్న వైఎస్సార్ పశుబీమా పథకం పశు పోషకులకు తీపి కబురులాంటిది. మగ పశువులకు కూడా బీమా రక్షణ కల్పించడం అభినందనీయం. గత బీమా ప్రక్రియను సంస్కరిస్తూ, పారదర్శకతకు పెద్ద పీట వేశారు. జిల్లా వ్యాప్తంగా మొదటి దశలో విధించిన లక్ష్యాన్ని పూర్తి చేస్తాం. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకొని పశువులకు బీమా రక్షణ పొందాలి.

– నరసింహారావు, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి, నంద్యాల జిల్లా

వేడుకగా ప్రతిష్ఠోత్సవాలు



ఆంజనేయ స్వామి విగ్రహాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం



టి.లింగదిన్నెలో నూతనంగా నిర్మించిన లక్ష్మీ నరసింహస్వామి ఆలయం

నంద్యాల(న్యూటౌన్): మిట్నాల గ్రామంలో గణపతి వీరభద్ర, ఉమా సమేత నాగలింగేశ్వర స్వామి వార్ల విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ వేడుకలు అత్యంత వైభవంగా జరిగాయి. వేదపండితులు ప్రభాకర్‌శర్మ, శివయ్యశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలతో బుధవారం ప్రతిష్ఠోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామం భక్తులతో కిటకిటలాడింది. ముందుగా అవాహిత పూజలు, అభిషేకాలు, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, మహాబలి ప్రదానం, మహాకుంభాభిషేకం, మంగళ హారతులు, పూర్ణాహుతి హోమాలు, మంత్రపుష్పాలు, తీర్థప్రసాద వినియోగం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. గ్రామంలో మూడు రోజులుగా జరుగుతున్న ఉత్సవాలకు నిర్వాహకులు కొమ్మిరెడ్డి రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో హాజరైన భక్తులందరికీ ఉచిత భోజన సౌకర్యంతో పాటు పశుప్రదర్శన పోటీలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు హాజరై పోటీలను తిలకించారు. తాలూకా ఎస్ఐ నాగరాజు బందోబస్తు ఏర్పాటు చేశారు.

నేటి నుంచి..

రుద్రవరం: మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో నూతనంగా నిర్మించిన లక్ష్మీనర సింహాస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠోత్సాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. గ్రామస్తులు ఏకమై ఆలయాన్ని నిర్మించారు. పనులు పూర్తి కావడంతో నూతన విగ్రహ,ధ్వజ ప్రతిష్ఠోత్సవాలకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. జూన్ 1 నుంచి 3వ తేదీ వరకు విశేష పూజా కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. అలాగే 2న సేద్యపు ఎద్దులకు బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలకు రూ.25వేలు అందజేస్తామని చెప్పారు.

తోటలపై రైతులకు అవగాహన కల్పించండి



నంద్యాల ఏపీఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏపీడీ బాలాజీ నాయక్

నంద్యాల(రూరల్): పండ్ల తోటల సాగుపై రైతులకు అవగాహన కల్పించి సాగుకు ముందుకొచ్చేలా చేయాలని ఏపీడీ బాలాజీ నాయక్ సూచించారు. బుధవారం పట్టణంలోని ఏపీఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి కూలి ఉపాధి హామీ పథకం పని కల్పించాలని ఆదేశించారు. పండ్ల తోటలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ గురించి అవగాహన సదస్సులు నిర్వహించి రైతులకు తెలియజేయాలన్నారు. నంద్యాల క్లస్టర్ పరిధిలో నంద్యాల మండలానికి 100 ఎకరాలు, గడివేముల మండలానికి 175 ఎకరాలు, బండిఆత్మకూరు మండలానికి 125 ఎకరాలు, పాణ్యంకు 150 ఎకరాలు, గోస్పాడుకు 100 ఎకరాలు, మహానందికి 100 ఎకరాలు, మిడుతూరుకు 100 ఎకరాల పండ్ల తోటలు పెంచాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించిందని చెప్పారు. వాటికి అనుగుణంగా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నమన్నారు. ఏపీఓ శ్రీకళారెడ్డి, టీఏలు,సిబ్బంది ఉన్నారు.

పొగాకుతో జీవితం ఛిన్నాభిన్నం



మాట్లాడతున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి

నంద్యాల(సిటీ):నిషేధిత, ప్రాణాంతకమైన పొగాకు పట్ల అప్రమత్తంగా ఉండాలని, పొగాకు వినియో గంతో జీవితాలు ఛిన్నాభిన్నమవుతాయని మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక కార్యాలయంలో హర్సెల్ఫ్ సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని అవగాహన కార్యక్రమం ఏర్పా టు చేశారు. మానసిక వైద్యులు కిశోర్‌కుమార్ తో కలిసి మాట్లాడారు. ప్రస్తుత జీవనవిధానంలో వస్తు న్న వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. పొగా కు వినియోగం వల్ల మనిషికి నోరు, ఊపిరితిత్తులలో వచ్చే కేన్సర్‌లు, ఇతర వ్యాధులకు కారకాలు గా మారుతాయన్నారు. బహిరంగ ప్రదేశంలో పొగాకు పీల్చడం వల్ల తనతోపాటు చుట్టూ ఉన్న వారందరికీ ఎన్నో అనర్థాలు కలుగుతాయని చెప్పారు.రాజశేఖర్, శానిటరీ సూపర్‌వైజర్ లక్ష్మీనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శివప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత పొగాకుకు దూరంగా ఉండాలి

చాగలమర్రి: యువత పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని మండల ప్రభుత్వ వైద్యాధికారి ఇమ్రాన్ కోరారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సు గలవారు ధూమపానం చేయడం వల్ల వారి ఆరోగ్యం చెడిపోతుందని, తద్వారా ప్రాణాంతక వ్యాధులైన క్యాన్సర్, క్షయ, టీబీ వ్యాధులు సోకుతాయన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే అనర్థాలను విద్యాలయాల్లో విస్తృతంగా ప్రచారం చేసేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. సీహెచ్ఓ రమణమ్మ, హెల్త్ ఎడ్యుకేటర్ వెంకటమ్మ, సూపర్ వైజర్లు, అరోగ్య, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నంద్యాల టౌన్: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఆర్.వెంకటరమణ ఆధ్వర్యంలో పొగాకు వాడడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. స్థానిక సర్వజన అసుపత్రి నుండి వైఎస్సార్ విగ్రహం వరకు వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మే 31 నుంచి జూలై 31 వరకు 60రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు చేపడుతామన్నారు. పొగాకు మానుకోవాలనుకునే వారు 18004252024 టోల్ ఫ్రీ నంబరుకు కాల్ చేసి ఉచితంగా సలహాలు, సూచనలు పొందవచ్చని తెలిపారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి డాక్టర్ ప్రభావతి, డాక్టర్లు కాంతారావు, మల్లికార్జున రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పొగాకు వాడకం హానికరం

గోస్పాడు: పొగాకు వాడకం ఆరోగ్యానికి హానికరమని గోస్పాడు వైద్యాధికారి గోపాల్ తెలిపారు. బుధవారం ప్రపంచ పొగాకు నిర్మూలన దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ధూమపానం జీవితాన్ని కాల్చి వేస్తుందన్నారు. చిన్న వయస్సు నుంచే బానిస అవుతున్నారని, పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని సూచించారు.

3న విద్యార్థుల ప్రదర్శన

నంద్యాల(న్యూటౌన్): జవహర్ బాల కేంద్ర నంద్యాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఈనెల 3న వేసవి శిక్షణ ప్రదర్శనోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జవహర్ బాల కేంద్ర సూపరింటెండెంట్ ప్రసాదరెడ్డి బుధవారం తెలిపారు. పట్టణంలోని వివేకానంద ఆడిటోరియంలో సాయంత్రం 6గంటలకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో విద్యార్థులు వివిధ ప్రదర్శనలు చేపతారని పేర్కొన్నారు.

సివిల్ పంచాయతీల్లో జోక్యం చేసుకోరాదు

నంద్యాల(న్యూటౌన్): పోలీసులు సివిల్ పంచాయతీల్లో జోక్యం మానుకోవాలని సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ దివాకర్ అనుమానాస్పద మృతిపై సమగ్ర విచారణ జరిపించాలని, ఆత్మకూరు డివిజన్ పరిధిలో పోలీసు యంత్రాంగం సివిల్ పంచాయతీల్లో జోక్యం మానుకోవాలని, ఉన్నతాధికారులు ఈ విషయంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పోలీసులు దివాకర్‌ను విచారణ చేసి పంపిస్తామని చెప్పి చివరకు మృతి చెందాడని చెప్పడం విచారకరన్నారు. చివరకు కుటుంబ సభ్యులకు దివాకర్ మృతదేహాన్ని చూపించకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు.మృతికి కారకులైన పోలీసులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు

దొర్నిపాడు: మండలకేంద్రలో సయ్యద్ దస్తగిరి స్వామి ఉరుసును బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం పక్కీర్లు మేళతాళాలతో గంధం తీసుకొచ్చి స్వామి వారికి సమర్పించారు. ఉత్సవాల సందర్భంగా గురువారం ఎద్దుల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నారు. విజేతలకు రూ.25వేలు, రూ.20వేలు, రూ.15వేలు, రూ.10,016, రూ.8వేలు, రూ.4వేలు, రూ.3వేలు, రూ.2116, రూ.1,500 బహుమతులు అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఖైరున్‌బీ అనే మహిళ గాయపడింది. నంద్యాల పట్టణానికి చెందిన ఖైరున్‌బీ తిరుపతికి వెళ్లి పనులు ముగించుకుని బుధవారం తిరుపతి నుంచి సొంతూరు నంద్యాలకు కారులో బయలు దేరింది. ఈ క్రమంలో ఆళ్లగడ్డ పట్టణ శివారులో జమ్ములమడుగు వైపు నుంచి వస్తున్న ఆర్టీసీ బస్సు హైవే పైకి వస్తుండగా కారు బస్సును ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఖైరున్‌బీ తీవ్రంగా గాయడింది. ఆమెను స్థానిక వైద్యశాలలో ప్రథమ చికిత్స అనంతరం వైద్యుల సిఫారసు మేరకు మెరుగైన చికిత్స కోసం నంద్యాల వైద్యశాలకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బాలలను పనిలో పెట్టుకోవద్దు

నంద్యాల టౌన్: బాలలను పనిలో పెటుకోవటం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఇన్‌చార్జ్ సహాయ కార్మిక కమిషనర్ ఎస్.బషిరున్నీసా తెలిపారు. బుధవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ కమిటీ అన్ ఎలిమినేషన్ ఆఫ్ చైల్డ్ లేబర్‌పై నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం జూన్‌నెలను బాలకార్మిక నిర్మూలన మాసంగా ప్రకటించిందని, జిల్లా వ్యాప్తంగా ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తామని, ఇందులో పట్టుబడిన సంస్థలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమావేశంలో డీఎం అండ్‌హెచ్‌ఓ వెంకటరమణ, పోలీసు అధికారులు, ఐసీడీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

బొమ్మలసత్రం: నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తప్పవని, ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మిన విత్తన దుకాణాలను సీజ్ చేస్తామని నంద్యాల మండల వ్యవసాయ అధికారి స్వప్నిక హెచ్చరించారు. బుధవారం పట్టణంలో బస్టాండ్ ఏరియాలో ఉన్న విత్తన దుకాణాలను విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో కలిసి ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. వెంకటేశ్వర సీడ్స్ ఆగ్రో ఏజెన్సీ, శ్రీచక్ర సీడ్స్ ఏజెన్సీలో తనిఖీలు చేసి రికార్డులు, బిల్లులు పరిశీలించారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ కేశవ రెడ్డి, సిద్దయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు రద్దు కావు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

చాగలమర్రి: జగనన్న లే అవుట్లలో లబ్ధిదారులకు మంజూరు చేసని ఇళ్ల పట్టాలు రద్దు కావని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి తెలిపారు.బుధవారం పట్టణంలోని శ్రీవాసమి కళ్యాణ మండపంలో జరిగిన ఓ శుభకార్యంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గృహాలు మంజూరైన వారు వెంటనే నిర్మాణాలు చేపట్టాలని కోరారు. పనులు ప్రారంభించకపోతే స్థలం ఇచ్చి లాభం ఏంటని ప్రశ్నించారు. త్వరగా పనులు పూర్తి చేయాలనే ఉద్దేశ్యంలో అధికారులు చెబుతున్నారని, అనవసరంగా ఎవరి పట్టా రద్దు చేయరని చెప్పారు. నాయకులు నరసింహారెడ్డి, ముల్లా.షబ్బీర్, షేక్.బాబులాల్, జి.కుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ ముల్లా రఫీ, గేట్ల మాబు, ఖాదర్‌బాషా ఉన్నారు.

ఆ హెచ్‌ఎంలపై చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శామూన్

నంద్యాల: మన బడి నాడు–నేడు పనులు పర్యవేక్షించేందుకు హాజరు కాని పాఠశాలల ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో నాడు–నేడు పనుల ప్రగతిపై జాయింట్ కలెక్టర్ నిశాంతి, అధికారులతో కలిసి కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనుల పర్యవేక్షణకు హెచ్‌ఎంలు హాజరు కావడం లేదని తన దృష్టికి వచ్చిందని, అలాంటిపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు సూచించారు. నాడు–నేడు పనులన్నీ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పాఠశాలలో చాలా చోట్ల టాయిలెట్లు లెంటల్ దశలోనే ఉన్నాయని త్వరితగతిన రూఫ్ స్థాయికి తీసుకు రావడంతో పాటు ఫ్లోరింగ్ పూర్తి చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న కిచెన్ షెడ్స్ మూడు రోజుల్లో పూర్తి కావాలని ఆదేశించారు. ఆధార్‌ను ఆధారంగా చేసుకొని బడి ఈడు పిల్లల గుర్తింపు సర్వే వేగవంతం చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 35శాతం సర్వేను మూడు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో డీఈఓ అనురాధ, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారి లలిత, డీఆర్‌డీఏ పీడీ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లి మృతి..

కుమారుడికి తీవ్ర గాయాలు



మృతి చెందిన బీబీ



తీవ్రంగా గాయపడిన గౌస్‌బాషా

చాగలమర్రి: వైఎస్సార్ కడప జిల్లా, దువ్వూరు మండలం కానగుడురు గ్రామ సమీపంలో పెట్రోల్ బంకు వద్ద కడప వైపు నుంచి వస్తున్న ఏపీ21 బీహెచ్ 1899 అను నంబరు గల నంద్యాలకు చెందిన కారు, ముందు వెళ్తున్న ఏపీ 04 ఏఎక్స్9786 అనే నంబరు గల బైక్‌ను అదుపు తప్పి ఢీ కొట్టింది. ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న మండలంలోని ముత్యాలపాడు గ్రామానికి చెందిన బీబీ (50) అక్కడికక్కడే మృతి చెందగా, గౌస్‌బాషాకు తీవ్ర గాయాలవడంతో ప్రొద్దుటూరు ప్రభుత్వ అసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించటంతో వైద్యులు కడప రిమ్స్‌కు రెఫర్ చేశారు. మృతురాలి బంధువులు తెలిపిన వివరాల మేరకు.. చాగలమర్రి మండలం, ముత్యాలపాడు గ్రామానికి చెందిన గౌస్‌బాషా పంక్చర్ షాపు నిర్వహించేవాడు. ఆదాయం తక్కువగా ఉండటంతో సౌదీకి వెళ్లి కొన్నేళ్లు ఉండి రెండేళ్ల క్రితం తిరిగొచ్చాడు. మళ్లీ సౌదికి వెళ్లాలని ప్రయతిన్నంచి మూడు రోజుల క్రితం బయలుదేరి వెళ్లాడు. గతంలో తాను పనిచేసిన యజమానితో గొడవపడి సమాచారమివ్వకుండా ఇండియా వచ్చేశాడు. ఆ సమయంలో అక్కడ ఆయనపై కేసు నమోదైంది. దీంతో ఇటీవల మరోసారి వెళ్లగా కేసు గురించి తెలుసుకొని వెంటనే తిరిగి వచ్చేశాడు. సౌదీ వెళ్లే ముందు తన బైక్‌ను వెలవలిలోనున్న బంధువుల ఇంట్లో ఉంచి వెళ్లాడు. ఆ బైక్‌ను తీసుకొచ్చేందుకు తల్లి బీబీతో కలిసి వెళ్లాడు. బుధవారం సాయంత్రం 6.00 గంటల సమయంలో తన చెల్లెలు, ఆమె భర్త ఒక బైక్‌పై, తల్లీకుమారుడు ఒక బైక్‌పై వెళ్తుండగా కానగుడురు సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద వెనుక కడప వైపు నుంచి వేగంగా వచ్చి కారు ఢీకొట్టడంతో బీబీ అక్కడికక్కడే మృతి చెందింది. గౌస్ తీవ్రంగా గాయపడ్డాడు. దువ్వూరు పోలీసులు కారును అదుపులోకి తీసుకొని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


నిబంధనలు పాటించని స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నంద్యాల(న్యూటౌన్): ప్రభుత్వ నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు, ఉపాధ్యక్షుడు సురేష్ కోరారు. ఈ మేరకు బుధవారం డీఈఓ అనురాధను కలిసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గడివేముల మండలంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఫీజుల పేరుతో దోపిడీ చేస్తూ విద్యాసంవత్సరం ప్రారంభం కాకున్నా అక్రమ అడ్మిషన్లు చేస్తున్న స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

పనివేళలు మార్చండి

నంద్యాల(సిటీ): పట్టణంలో ఉదయం 5 గంటల నుంచి విధులు నిర్వహిస్తున్న సచివాలయ సెక్రటరీల పని వేళల్లో మార్పులు చేయాలని గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గుజ్జల ఈశ్వరయ్య, వైస్‌ప్రెసిడెంట్ లక్ష్మీపార్వతి, జనరల్ సెక్రటరీ రాజేష్ పట్టణ పారిశుద్య కార్యదర్శులతో కలిసి మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డిని కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విధులు నిర్వహిస్తున్నారన్నారు. అలాగే సచివాలయ పారిశుద్య పర్యావరణ కార్యదర్శులకు అమలు చేయాలని కోరారు.

మల్లన్న సేవలో..



దర్శనానికి వెళ్తున్న గోపాలకృష్ణ ద్వివేది

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్లను ఏపీ వ్యవసాయ సహకారం, పశు పోషణ, పాల అభివృద్ధి ప్రత్యేక ముఖ్య కార్యదర్శి గోపాల కృష్ణ ద్వివేది దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. బుధవారం రాత్రి మల్లన్న దర్శనార్థం ఆలయం వద్దకు విచ్చేసిన అధికారికి ఆలయ రాజగోపురం వద్ద దేవస్థాన ఈఓ ఎస్.లవన్న, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆశీర్వచన మండపంలో అధికారికి వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు.